నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 15 మార్చి 2024 | KARIMNAGAR

ఆడబిడ్డలకు గౌరవం

- పెద్దపల్లి జిల్లాలో ఇద్దరికి పురస్కారం
- క్రీడా విభాగంలో చికిత, సాహిత్యంలో వీణావాణికి అవకాశం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపిక

పెద్దపల్లి, మార్చి 14 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం 2024కు గానూ 19 మందికి అవార్డులను ప్రకటించింది. అందులో పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం దక్కింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి తానిపర్తి చికితను క్రీడారంగంలో, జూలపల్లి మండలకేంద్రానికి చెందిన దేవనపల్లి వీణావాణిని సాహిత్య రంగంలో ఎంపిక చేయగా, సర్వత్రా హర్షం వ్యక్తమైంది. రాష్ట్ర మహిళా శిశు, వైకల్య, వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఈ అవార్డులను పంపిణీ చేయనున్నది.

గురి తప్పని చికిత బాణం

ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి శ్రీనివాస్ రావు- శ్రీలత దంపతుల కూతురు, కొడుకు. రైతు కుటుంబం. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన కూతురు చికిత, ఎనిమిదేండ్ల వయసులోనే విలు విద్యపై ఆసక్తి పెంచుకున్నది. బిడ్డ ఇష్టాన్ని గమనించి తండ్రి శిక్షణ ఇప్పించడంతో పట్టు సాధించింది. 2017 -18లో క్రీడా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆ యువతి, గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. గతేడాది బెంగళూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నీలో పసిడి పథకంతో ప్రతిభ చాటుకున్నది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా జూనియర్, సీనియర్ నేషనల్ గేమ్స్‌లో బహుమతుల పంట పండించింది. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన చికిత ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో ఫథకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది.

సాహిత్యంపై మక్కువ

దేవనపల్లి వీణావాణిది స్వస్థలం జూలపల్లి కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో వృక్షశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2005లో అటవీ శాఖలో ఉద్యోగం సాధించి ప్రస్తుతం అదే శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారిగా పనిచేస్తున్నారు. జోగులాంబ సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ అధికారిగా, నారాయణపేట జిల్లా అటవీ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వరిస్తున్నారు. అయితే, తెలుగు సాహిత్యంపై ఉన్న అభిరుచితో రెండు కవితా సంకలనాలు, ఒక పర్యావరణ వ్యాసాలు రాశారు. ఆమె అనేక పురస్కారాలు అందుకున్నారు. 2020లో సంత్‌రామరాసు సేవావాల్ పురస్కారం, క్యాతం కృష్ణారెడ్డి పురస్కారం, 2021లో తిరుణగరి శ్రీనివాసాచార్య జాతీయ పురస్కారం, 2022లో పీచర సునీతారావు సాహిత్య పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారం పొందారు.

ప్రమాదంలో రైతుల ఖాతాలు

- పంటరుణం చెల్లించని అకౌంట్లపై బ్యాంకుల ఫోకస్
- స్తంభింపజేయాలని నిర్ణయం?
- ఇదే జరిగితే భవిష్యత్తులో మళ్లీ రుణాలు గగనమే
- ఆందోళనలో అన్నదాతలు
- రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్

రైతుల బ్యాంకు ఖాతాలు ప్రమాదంలో పడనున్నాయా..? అంటే ఔననే సంకేతాలు వస్తున్నాయి. పంట రుణాలు పొంది నిర్దేశిత గడువులోగా చెల్లించని వారి అకౌంట్లను నిలిపివేయాలని బ్యాంకులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే ఈ నిర్ణయం రైతుల పాలిట ఆశనిపాతం కానుంది. భవిష్యత్తులో మళ్లీ రుణాలు పొందడం గగనమే అవుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ₹2 లక్షల రుణమాఫీపై సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

జగిత్యాల, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం ఇటీవల నిర్వహించగా, అందులో నిరార్థక ఖాతాలుగా రైతుల అకౌంట్లు మారినట్లు వెలుగు చూసింది. గతంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం రెండు పర్యాయాలు పంట రుణాలు మాఫీ చేయడం, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు పంట రుణాలు కొన్నేండ్లుగా సరిగా చెల్లించని విషయం తెలిసిందే. అయితే, రైతులు తీసుకున్న పంట రుణాలకు అసలు కాదు కదా..? కనీసం వడ్డీ సైతం చెల్లించకపోవడంతో ఆ రైతుల ఖాతాలన్నింటినీ నిరర్థకమైన (నాన్ పర్ఫామింగ్ అకౌంట్స్)గా గుర్తించిన బ్యాంకర్లు వాటిని స్తంభింపజేసినట్లు తెలుస్తున్నది. నాన్ పర్ఫామింగ్ ఖాతాలుగా గుర్తింపు పొందిన అకౌంట్లకు భవిష్యత్తులో రుణాలు ఇవ్వరాదని నిర్ణయించడంతోపాటు వారు పూచీకత్తు ఇచ్చిన ఆస్తులను జప్తు చేయడం, వేలం వేసే జాబితాలో చేర్చినట్లుగా తెలుస్తున్నది. బ్యాంకర్ల ఈ నిర్ణయం నేపథ్యంలో ఒక్క జగిత్యాల జిల్లాలోనే దాదాపు లక్షకుపైగా ఖాతాలు స్తంభించే ప్రమాదంలో ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 99 వేలకు పైచిలుకు మంది రైతులు ₹413 కోట్ల పంట రుణాలను పొందారు. అందులో ఎందరు పంట రుణాలు చెల్లించారు? ఎందరు చెల్లించలేదు? కనీసం వడ్డీ చెల్లించిన వారెందరు? అన్న విషయంపై అధికారులకు సైతం పూర్తిస్థాయిలో అవగాహన లేదు. అయితే, పంట రుణాలు పొందిన వారిలో 95 శాతం మంది రైతులు పంట రుణమాఫీ జరుగుతుందన్న నమ్మకంతో పంటరుణాలు చెల్లించడం మానివేసినట్లు బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. బ్యాంకర్ల నిర్ణయం నేపథ్యంలో జిల్లాలో పెద్ద సంఖ్యలోనే రైతుల ఖాతాలు స్తంభించిపోయే ప్రమాదమున్నది.

తగ్గిపోయిన రుణాల చెల్లింపులు

2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన అప్పటి ప్రభుత్వం 2016లో రుణమాఫీ చేసింది. అయితే, రూ.లక్షకు పైగా రుణం తీసుకున్న రైతులు చాలా ఏండ్లుగా రుణం చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. ప్రస్తుతం ఇటీవలీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు సంబంధించి ₹2 లక్షల రుణమాఫీని ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ₹2 లక్షల పంట రుణాలను రైతులు తీసుకోవాలని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని మాఫీ చేస్తామని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి విధితమే. ఇలా గత ప్రభుత్వం రుణమాఫీ చేయడం, ప్రస్తుత ప్రభుత్వం సైతం రుణమాఫీ గత ప్రభుత్వం కంటే రెట్టింపుగా చేస్తామని చెప్పడంతో రైతులు రుణాలు తీసుకొని వాటిని చెల్లించలేదు. అసలు కాదు కదా కనీసం వడ్డీని సైతం చెల్లించడం నిలిపివేశారు. పంట రుణాల నిబంధన ప్రకారం రైతులు తీసుకున్న రుణాన్ని పంట దిగుబడి వచ్చిన తదుపరి ధాన్యం విక్రయం అనంతరం ఏడాదికి ఒక్కసారి రుణం బ్యాంకులకు తిరిగి చెల్లించాలి. ఏడాదిలో రుణం చెల్లిస్తే, రైతుకు వడ్డీలో కొంత రాయితీని ఇవ్వడంతోపాటు మరుసటి ఏడాదికి సంబంధించి పంట రుణాలను బ్యాంకులు ఇస్తూ వచ్చాయి. ఇక దీర్ఘకాలిక రుణాలు, పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్న రైతులు ఆరు నెలలకు ఒకసారి కిస్తీలు చెల్లించాలన్నది నిబంధన. ఈ నిబంధనలు పాటించకపోతే బ్యాంకర్లు ముందుగా రైతులకు సంబంధించిన ఖాతాలను ఎన్పీఏ ఖాతాలుగా ప్రకటించి రైతులపై ఒత్తిడి తీసుకువచ్చి రుణాలను వసూలు చేసుకునేది. ఖాతాలు స్తంభించినా, రైతుల వద్ద నుంచి రుణమొత్తాలు రాకపోతే, వారు బ్యాంకులో పెట్టిన పూచికత్తులను, సొంత ఆస్తులను జప్తు చేసుకోవడం, వేలం వేసే ప్రక్రియలకు శ్రీకారం చుడుతామని చెప్పేవారు. ఇది సహజంగా బ్యాంకులు నిర్వహించే ప్రాసెస్. అయితే దశాబ్దకాలంగా ఈ వ్యవహారం కనిపించడం లేదు. రైతులు రుణమాఫీకి సంబంధించిన చెల్లింపులు 90శాతానికిపైగా తగ్గిపోయాయి.

₹2 లక్షల రుణమాఫీ ఎప్పుడో?

సీఎం రేవంత్‌రెడ్డి ₹2 లక్షల రుణమాఫీ చేస్తామని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రక్రియ చేపడుతామని ప్రకటించిన విషయం విదితమే. అయితే, రుణమాఫీ ఎప్పుడు చేస్తారన్న విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. రైతులు తీసుకున్న మొత్తానికి రుణమాఫీ చేస్తారా..? వడ్డీని సైతం కలుపుకొని చేస్తారా..? గతంలో మిగిలిపోయిన రుణాలు సైతం మాఫీ అవుతాయా..? ఎవరైనా రైతులు రుణాలు తీసుకొని చెల్లిస్తే వారికి ఏ విధమైన ప్రోత్సాహకాలు ఇస్తారా..? తదితర అంశాలపై ఎలాంటి క్లారిటీ ఇవ్వడం లేదు. ఇదే సమయంలోనే బ్యాంకర్లు ఎన్పీఏ ఖాతాలుగా గుర్తించి, ఆస్తులు జప్తు చేయడం, వేలం వేసే కేటగిరీలో చేర్చారన్న విషయంతో రైతన్నలు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. ఖాతాలు సీజ్ అయితే తాము భవిష్యత్తులో ఇతర రుణాలు తీసుకొనే అవకాశం ఉండదని, ఆర్థిక వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టాలని, రైతుల బ్యాంకు ఖాతాలను నాన్‌పర్ఫామింగ్ అకౌంట్స్ విభాగం నుంచి బయటపడేలా చూడాలని కోరుతున్నారు.

అభివృద్ధిపై 'బండి' చర్చకు సిద్ధమా?

ఓటమి భయంతోనే సంజయ్ ప్రేలాపనలు

- కరీంనగర్ అభివృద్ధి ప్రదాత వినోద్
- రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్‌లో మాట్లాడుతున్న సర్దార్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, మార్చి 14: బండి సంజయ్.. ఐదేండ్ల పదవీకాలంలో చేసిన అభివృద్ధిపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో చర్చకు సిద్ధమా..? అని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ సవాల్ విసిరారు. కరీంనగర్ అభివృద్ధికి తెచ్చిన నిధులెన్ని? చేసిన పనులేంటి? ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కదనభేరికి ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి ఆయనకు ఓటమి భయం పట్టుకున్నదని, అందుకే పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నడంటూ నిప్పులు చెరిగారు. హిందుత్వం పేరిట ప్రజలను రెచ్చగొడుతున్న సంజయ్‌కి గుడి, బడి కట్టాలనే సోయి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కానీ, వినోద్‌కుమార్ టీటీడీని ఒప్పించి ₹25 కోట్లు తెచ్చి కరీంనగర్‌లో బ్రహ్మాండమైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారన్నారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో భార్య పుస్తెలతాడు అమ్మి పోటీ చేస్తున్నానని చెప్పిన బండి సంజయ్‌కి ఇప్పుడు వందల కోట్లు ఎక్కడినుంచి వచ్చాయన్నారు. ఓటమి తప్పదని తెలిసే నాన్ లోకల్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడీ ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నారో చెప్పాలన్నారు. నిజామాబాద్‌కు చెందిన అర్వింద్ గత ఎన్నికల్లో కోరుట్ల నుంచి పోటీ చేశారని పేర్కొన్నారు. ఐదేళ్లు ఎంపీగా వినోద్ కుమార్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించారని గర్తు చేశారు. ఆయన ఓడిపోయినా ప్రజల మధ్యే ఉన్నారని చెప్పారు. వినోద్ ఎంపీగా ఉన్నప్పుడు జిల్లాకు ఐదు జాతీయ రహదారులు తీసుకొచ్చారన్నారు. కొత్తపల్లి నుంచి మనోహరాబాద్ రైల్వేలైన్ మంజూరు చేయించారన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీతో వెయ్యి కోట్లు తీసుకువచ్చారన్నారు. కానీ, ఈ ఐదేళ్లలో సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ, మెడికల్ కళాశాల కూడా ఎందుకు మంజూరు చేయించలేదని నిలదీశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మీ అధిష్టానం నిన్ను ఎందుకు తొలగించిందో చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీతో చేతులు కలిపి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, పొన్నం అనిల్, కెమసారం తిరుపతి, జయంత్, రవి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మనగుర్తిలో సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తాగునీటికి ఇబ్బందులు రానివ్వం

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తా • మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, మార్చి14 : వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లిలో 18 గ్రామాలకు సంబంధించిన ₹75 లక్షల విలువైన పనులు, అమ్మనగుర్తిలో ₹2కోట్లతో నిర్మించే 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు ఆయన కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటి సమస్య రాకుండా హుస్నాబాద్ నియోజకవర్గానికి ₹3.5 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థి సంఘం నాయకుడి నుంచి వచ్చిన తనకు పాఠశాలల సమస్యలు తెలుసని, వాటిని పరిష్కరిస్తానన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, ₹500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై వైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసి మంత్రిని సన్మానించారు. సర్వాయిపేట బస్సు నడుపాలని పలువురు కోరగా సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామని, పాఠశాలల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ యాదగిరి, ఎంపీటీసీలు జంపాల సంతోష్, తొంట ఓదెలు, లంకదాసరి అరుణమల్లయ్య, చాంద్‌పాషా, చైతన్య కొండాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో పంట పొలాలను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

'మార్పు' అంటే పంటలు ఎండ బెట్టుడేనా..?

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని రూరల్, మార్చి14: 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ పాలన, మార్పు వస్తుందని గొప్పలు చెప్పిన్రు. అసలు మార్పు అంటే పంటలు ఎండబెట్టుడేనా..?' అని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మండిపడ్డారు. ఇప్పటికే పంటలు పెద్దఎత్తున ఎండిపోయాయని, మిగిలిన పంటలకైనా నీరందించి కాడాపాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. మంథని మండలం మైదుపల్లి, కాకర్లపల్లి శివారులో పొట్టదశలో ఎండిపోయిన పంట పొలాలు, నెర్రెలు బారిన భూములను గురువారం ఆయన పరిశీలించారు. పంటల పరిస్థితి గురించి రైతులను అడిగితెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పదేళ్ల తర్వాత రైతులను నీళ్ల కోసం రోడ్డెక్కించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఆగ్రహించారు. నీళ్లు, కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన కాంగ్రెస్, కనీసం పట్టించుకోవడం లేదని అందుకే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రైతుల పక్షాన నిలబడ్డారని, కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరందించి చివరి ఆయకట్టులో ఒక్క ఎకరం ఎండిపోకుండా నీరందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీళ్లున్నా పంటలు ఎండబెట్టడం సరికాదన్నారు. మార్పు.. మార్పు అంటే మూడు పంటలకు నీళ్లు వస్తాయని రైతులు ఆశపడ్డారని, కానీ, ఒక్క పంటకూ కూడా నీరందించని దుస్థితి తెచ్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, అందుకే సాగునీరు అందించడం లేదని ఆరోపించారు. ఇక్కడ నాయకులు తగరం శంకర్‌లాల్,ప్రభాకర్ రెడ్డి,రాజు గౌడ్, కనవెన శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీళ్ల కోసం మళ్లీ రోడ్డెక్కిన రైతన్న

పెద్దపల్లి-కాటారం రహదారిపై నాలుగు గంటలకుపైగా రాస్తారోకో

సాగునీటి కోసం మంథని ప్రాంత రైతులు మళ్లీ రోడ్డెక్కారు. ఎండుతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఎర్రటి ఎండలో నాలుగు గంటలకుపైగా మంథనిలో ఆందోళన చేశారు. పురుగుల మందు డబ్బాలు, ఎండిన వరిని పట్టుకొని నిరసనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. చివరకు పోలీస్ అధికారుల హామీతో శాంతించారు.

పురుగుల మందు డబ్బా, ఎండిన వరితో నిరసన తెలుపుతున్న రైతులు

రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

మంథని, మార్చి 14: సాగునీరందించి పంటలను కాపాడాలని ఈ నెల 7న మంథని మండలం సూరయ్యపల్లి, కాకర్లపల్లి, మైదుపల్లి, ముత్తారం మండలం రామకృష్ణాపూర్, గంగాపురి గ్రామాల రైతులు మంథనిలోని బొక్కలవాగు వంతెన సమీపంలో పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఆర్డీవో హనుమానాయక్ అక్కడికి చేరుకొని రెండు రోజుల్లో కాలువలకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. అయితే వారందాటినా నీరందకపోవడం, పంటలు ఎండుతుండడంతో మంథని ప్రాంత రైతులు మళ్లీ రోడ్డెక్కారు. గురువారం పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పురుగుల మందు డబ్బాలు, ఎండిన వరిని చేత పట్టుకొని బైఠాయించారు. ఇదివరకే నీరందిస్తామని అధికారులు హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ నీటి గోస రాలేదని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ వచ్చిన వెంటనే కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సాగునీరందించే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. ఎర్రటి ఎండలో నాలుగు గంటలకుపైగా ఆందోళన చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలిసి ఆర్డీవో హనుమానాయక్, ఈతు బలరాంనాయక్ అక్కడకు చేరుకొని రైతులను శాంతింపజేసేందుకు విఫలయత్నం చేశారు. గతంలో నీళ్లు ఇస్తామని మోసం చేశారంటూ రైతులు నిలదీశారు. కాగా, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. సాగునీటి సమస్యను కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

మళ్లీ బాధలు మొదలైనయి

తెలంగాణ అచ్చినకాడి నుంచి ప్రభుత్వం మంచిగా సాగు నీరిచ్చింది. తొమ్మిదేండ్లలో ఎన్నడూ నీళ్లులేక పంటలు ఎండిపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ సాగు కష్టాలు మొదలైనయి. ఎంతో ఆశతో వరి వేసుకొన్నం. కానీ కండ్ల ముందటే ఎండిపోతుంటే మస్తు బాధనిపిస్తుంది. మొన్న తొమ్మిదో తారీకే నీళ్లు వస్తయని అధికారులు చెప్పి వారం దాటినా నీటి చుక్క కూడా రాలేదు. సార్లు దయతలిచి వెంటనే నీరందించి పంటలను కాపాడాలె. లేకుంటే కాలబెట్టుడే దిక్కయితది.

- కోరవేన శ్రీనివాస్, రైతు, సూరయ్యపల్లి (మంథని)

నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిష్పాక్షికంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఎన్నికల విధులు నిర్వర్తించే పలు విభాగాల అధికారులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళిని పరిశీలించాలని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను ఎక్కడికక్కడ అడ్డుకుని, ప్రత్యక్షంగా పట్టుబడ్డవారిపై కఠిన చర్యలకు సిఫారసు చేయాలని సూచించారు. నిరంతర తనిఖీలపై దిశానిర్దేశం చేశారు. పార్టీలపై సమదృష్టితో వ్యవహరిస్తూ, వివక్ష ప్రదర్శిస్తున్నారనే ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

జీతాలు ఇప్పించండి

- ఎమ్మెల్యే విజయ రమణారావుకు ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగుల వినతి

పెద్దపల్లి, మార్చి14: మూడు నెలలుగా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని, వెంటనే ఇప్పించాలని ఎస్ఆర్‌డీఎస్ (సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఆర్‌డీఎస్ జిల్లా జేఏసీ చైర్మన్ వెంకటేశ్, ఏపీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు గురువారం పెద్దపల్లిలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కాంట్రాక్ట్ ఎఫ్‌టీఈ ఉద్యోగులు టీఏ, ఈసీ, సీవో, ఏఏ, ఏపీవోలుగా వివిధ హోదాల్లో 332 మంది పని చేస్తున్నామని, మూడు నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంటి కిరాయి, స్కూల్ ఫీజులు కట్టలేని పరిస్థితుల్లో తీవ్ర మనోవేదన గురవుతున్నామని, వెంటనే పెండింగ్ వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

నేతన్నను ఆదుకోవాలి

బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆగయ్య • నేతన్న రిలేదీక్ష శిబిరం సందర్శన

రాజన్న సిరిసిల్ల, మార్చి 14 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేసి నేతన్నలను ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. మూతపడ్డ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కొత్తబస్టాండ్ వద్ద కార్మికులు 24గంటల రిలే దీక్షలు చేపట్టగా, బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ, నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కక్ష కట్టిందని, ఉపాధి లేక ఆగమైపోతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్కారుకు ఎక్కడ పేరు వస్తుందోనని, కేసీఆర్ పదేండ్ల పాలనలో చేపట్టిన పథకాల పేర్లన్నింటి మార్చి వేస్తున్నదన్నారు. బతుకమ్మ చీరలకు సైతం ఇందిరా, ప్రియాంక, సోనియా ఇలా ఏదో ఒక పేరు మార్చి అయినా నేతన్నలకు భరోసా కల్పించాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లు నిరంతరాయంగా మరమగ్గాల పరిశ్రమ నడిపించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు బకాయిలు రూ. 290కోట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. రాజకీయాలు పక్కన బెట్టి బకాయిలతో పాటు వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. ఇక్కడ టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, నాయకులు పూర్ణచందర్, వెంగల శ్రీనివాస్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, జిల్లా కార్యదర్శి కోడం రమణ, అబ్బాస్ పాల్గొన్నారు.

Repco
రెపెక్ హోమ్ ఫైనాన్స్ లిమిట